క్లుప్తంగా

నేడు, రేపు మెప్మా బజార్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో రెండు రోజులు మెప్మా బజార్‌ను నిర్వహిస్తున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధ, గురువారాల్లో కార్పొరేషన్ కార్యాలయం, తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం సమీపంలోని కృష్ణుడి గుడి వద్ద మెప్మా బజార్‌ను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం


ఫిరంగిపురం: నుదురుపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 8 గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల పనుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు నుదురుపాడు, కంభ్రిక, రేగులగడ్డ, బేతపూడి, యర్రగుంట్లపాడు, మేరికపూడి, మునగపాడు, గుండాలపాడు తదితరు గ్రామాలకు విద్యుత్ నిలిపివేస్తామని పేర్కొన్నారు.

22 మంది ఆధార్ నమోదు



ఫిరంగిపురం: వేములూరిపాడు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహించారు. అంగన్‌వాడీ చిన్నారులు నూతన ఆధార్ కోసం 22 మంది నమోదు చేసుకున్నారు. బుధవారం కూడా సిబ్బంది అందుబాటులో ఉంటారని మండల పరిషత్ అధికారులు తెలిపారు. డీఏ అరుణ, మహిళ పోలీసులు షబానా బేగం, కరిష్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలు



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు బాపూజీ విద్యాలయంలో శ్రీ చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండవ రోజు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన స్వామిజీ, భక్తులకు అనుగ్రహ భాషణ, ప్రవచనం చేశారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు పుష్పా ఎంపిక



నిడమర్రు(మంగళగిరి): నగర పరిధిలోని నిడమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.వెంకట పుష్పా రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నూతక్కి రవి మంగళవారం తెలిపారు. ఈ నెల 15, 16వ తేదీల్లో గుంటూరు జిల్లా ఫిరంగిపురం ఆర్‌సీజేసీ జూనియర్ కళాశాలలో జరిగిన అండర్-15 బాలుర, బాలికల ఇంటర్ డైరెక్ట్ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా బాలికల జట్టుకు 9వ తరగతి విద్యార్థిని జి.వెంకట పుష్పా ప్రాతినిధ్యం వహించినట్లు చెప్పారు. జట్టు బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థినిని హెచ్‌ఎం ఎస్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎ.బాలచంద్రారెడ్డి అభినందించారు. అలాగే రాష్ట్ర స్థాయికి ఎంపికైన కె.ఆనంద్, ఎం.సంజయ్‌లను పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ కె.శివకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలో ఇంటి తాళాలు పగలకొట్టి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం రాత్రి బాధితులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటి యజమాని ఎస్కే గాలీషా వివరాల ప్రకారం.. గత రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి.. కృష్ణా జిల్లా బందరులోని బంధువుల ఇంటికి గాలీషా వెళ్లారు. సోమవారం సాయంత్రం అతని కుమారుడు దస్తగిరి ఇంటికి వచ్చి కింద గదిలో పడుకున్నాడు.

12 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలకొట్టి, ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 30 కాసుల నల్లపూసల గొలుసు, చెవి దుద్దులతో పాటు మరో రూ.5 వేలు నగదు దొంగిలించారు. దొంగతనం అనంతరం వారు వెళ్తున్న సమయంలో ఇంటిపై నుంచి కిందపడి పెద్ద శబ్దం రావడంతో దస్తగిరి, బంధువులు నిద్రలేచి చూశారు. అప్పటికే గోడ దూకి ఓ వ్యక్తి పారిపోవడాన్ని గమనించి, తాడేపల్లి పోలీసులు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వచ్చిన తాడేపల్లి పోలీసులు అక్కడున్న సీసీ కెమెరాలను పరిశీలించారు. దస్తగిరి తండ్రి గాలీషా తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుష్మాన్ భవ

తాడేపల్లిరూరల్ : ప్రతి ఇంటిలో 70 ఏళ్లు నిండిన వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. వారికి మెరుగైన వైద్యం అందించడానికి ప్రణాళిక రూపొందించింది. దానిలో భాగంగా రూ.5 లక్షల హెల్త్ కవరేజీ ప్రకటించింది. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఈ ప్రత్యేక సేవను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పథకంలో ఇప్పటికే ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా కవరేజీ ఉంది. ఇప్పుడు 70 ఏళ్లు దాటిన వృద్ధులకూ రూ.5 లక్షలు బీమా ప్రకటించింది. ఈ సేవలను పొందడానికి సీనియర్ సిటిజన్లు ఆయుష్మాన్ భారత్ వయో వందన కార్డు పొందాల్సి ఉంటుంది. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులే.

కొత్త పథకం ద్వారా కవరేజీ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందవచ్చు. ఆయుష్మాన్ భారత్ వయో వందన కార్డు కోసం ఈ కింద తెలిపిన పద్ధతుల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన లోగో

మొబైల్ యాప్‌లో ఇలా..

మొబైల్ యాప్ లేదా ఆన్‌లైన్ పోర్టల్‌ను ఉపయోగించి కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ముందుగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. లబ్ధిదారుడిగా లాగిన్ అవ్వాలి. మొబైల్ నంబరు ఎంటర్ చేసి, క్యాప్చా కోడ్ చేయాలి. ఆధార్ నంబరు, ఇతర వివరాలను పూర్తి చేయాలి. పిన్ కోడ్, కుటుంబ సమాచారం, అవసరమైన వివరాలను నమోదు చేయాలి. దీంతో మీరు దరఖాస్తు చేసుకోవడం పూర్తవుతుంది. దాన్ని ఆమోదించిన తర్వాత ఆయుష్మాన్ వయో వందన కార్డును డౌన్ లోడ్ చేసుకోవాలి.

వెబ్‌సైట్‌లో ఇలా

ముందుగా బెనిఫిషరీ ఎన్‌హెచ్‌ఏఈఎస్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. మొబైల్ నంబరు, క్యాప్చాను ఉపయోగించి లాగిన్ అవ్వాలి. 70 ఏళ్లు పైబడిన వారి కోసం సీనియర్ సిటిజన్ ఎన్‌రోల్‌మెంట్ ఎంపికపై క్లిక్ చేయాలి. ఆధార్ నంబరు, ఇతర వివరాలను నమోదు చేయాలి. దరఖాస్తు సమర్పించి ఆమోదం అనంతరం 15 నిమిషాల్లో కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆధార్ ఆధారిత ఈకేవైసీ మాత్రమే అవసరమవుతుంది. సీనియర్ సిటిజన్లు ఏ విధమైన ఇబ్బంది లేకుండా కార్డును డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది.

రోడ్డు పేరుతో ఇళ్లను తొలగించవద్దు

తాడేపల్లిరూరల్: రోడ్డు పేరుతో పేదల ఇళ్లను తొలగించవద్దని ప్రజా దర్బార్‌లో విద్యాశాఖ, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు స్థానికులు సీపీఎం మద్దతుతో మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం రాజధాని శాఖ కార్యదర్శి ఎం. రవి మాట్లాడుతూ కొన్ని రోజులుగా రాజధాని గ్రామాల నుంచి ఈ లెవల్ రోడ్డు నివాసాల మీద నుంచి వెళ్తోందంటూ..ప్రచారం జరుగుతోందని, అక్కడి ప్రజలు ఆందోళన చెందుతుండడంతో..మంత్రికి విన్నవించినట్లు చెప్పారు. రోడ్డు పేరుతో నివాసాలను తొలగిస్తే ఉద్యమం చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రబాలెం సీపీఎం శాఖ కార్యదర్శి అత్తలూరి వీర వెంకయ్య, స్థానిక టీడీపీ నాయకులు సాలి నరేష్, సాగర్, శ్రీనివాసరావు, యేసు, దయమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజధాని డివిజన్ కార్యదర్శి రవి

నా ‘పీఏ’ దగ్గర పరిష్కరించుకోండి

- మంత్రి లోకేష్‌ను కలిసిన ‘ఏసీసీ’ కార్మికులు
- యాజమాన్యం నుంచి రూ. 43 కోట్లు ఇప్పించాలన్న వినతికి సమాధానం..

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే దీక్ష మంగళవారం నాటికి 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉండవల్లి కృష్ణా కరకట్టపై ఉన్న నివాసంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన రూ.43 కోట్లను యాజమాన్యం నుంచి అందే విధంగా చూడాలని కోరారు. అనంతరం దీక్షా శిబిరం వద్ద సీఐటీయూ నాయకుడు దుర్గారావు మాట్లాడుతూ అనేక రూపాల్లో ఇప్పటి దాకా కార్మికులు ఆందోళన చేసినా యాజమాన్యం స్పందించడం లేదన్న విషయాన్ని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఈ విషయమై స్పందించిన మంత్రి లోకేష్ ఫ్యాక్టరీ స్థలాల్లో గుడిసెలు వేయడం ఏంటని ప్రశ్నించారని, కోర్టు తీర్పు ప్రకారం ముందుకు వెళుతున్నట్లు తాము తెలియజేశామని తెలిపారు. ఈ విషయాన్ని తన వ్యక్తిగత కార్యదర్శి (పీఏ) వద్ద పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారని తెలిపారు. పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ, బి.అంకయ్య, ఎం.ఆశీర్వాదం, వై.యెహోషువా, రమాదేవి, దుర్గాభవాని, ఎం.శివకుమారి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



దీక్ష నిర్వహిస్తున్న ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలి

తెనాలిఅర్బన్: పీఆర్‌సీ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు మాచిరాజు రామకృష్ణమూర్తి, పి.ఎల్.జి సూర్యప్రకాశరావులు కోరారు. పెన్షనర్స్ డే సందర్భంగా కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధాప్యంలో పింఛన్ ఆధారంగా మారిందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లిస్తే వారికి ఆసరాగా నిలుస్తామని చెప్పారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని చెప్పారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

- పెన్షనర్స్ డే వేడుకలను ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్ సమీపంలోని ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.శివశంకరరావు, కె.బి.ప్రసాద్‌లు మాట్లాడుతూ 2014 సంవత్సరంలో పరిపాలన చేసిన ఎన్‌డీఏ ప్రభుత్వం ఓపీఎస్ స్థానంలో సీపీఎస్‌ను, ఎన్‌పీఎస్‌ను తెచ్చిందన్నారు. దీనివల్ల ఉద్యోగులు చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పింఛన్‌ను రూ.3 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని పాలకులు విస్మరించారని విమర్శించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు వి.ఆదినారాయణ, వి.ఎస్.భారతి, ఎ.సాంబశివరావు, ఎండీ గౌస్, కె.పూర్ణచంద్రరావు, కె.వెంకటేశ్వరరావు, కృష్ణ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



వృద్ధులను సన్మానిస్తున్న సభ్యులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, వైష్ణవి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావులు పేర్కొన్నారు. ఏబీవీపీ తెనాలి శాఖ నగర అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో మంగళవారం మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే అందరూ సేవా భావం కలిగి ఉండాలన్నారు. సమాజానికి ఉపయోగపడే అనేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఏబీవీపీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా తెనాలికి చెందిన వేదశ్రీ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. అలాగే వేదశ్రీని సన్మానించారు. కార్యక్రమంలో చైతన్య కళాశాల డీన్ తిరుపతిరావు, ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు, ఎస్ఆర్ఐ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, ఏబీవీపీ విభాగ కన్వీనర్ ప్రసాద్, లోకేష్, హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు మారుతీ వరప్రసాద్, హనుమంత్ ప్రసాద్, అవ్వారు శ్రీనివాసరావు, శేషు, మైలా హరి పాల్గొన్నారు.



మొక్కలను పంపిణీ చేస్తున్న డాక్టర్ రామ్‌చంద్, శ్రీనివాసరావు

క్రిస్మస్ కాంతులు



తాడికొండ: క్రీస్తు పుట్టిన రోజు పండుగ క్రిస్మస్ దినాలు దగ్గర పడుతుండటంతో గ్రామాల్లో క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. క్రీస్తు పుట్టుకకు సంబంధించిన ఆనవాళ్లను సూచిస్తూ ఆకాశంలో ఉదయించిన అరుణతారకు చిహ్నంగా గ్రామాల్లో స్టార్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వీడండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: విధి నిర్వహణలో అలసత్వం విడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం. లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 7, 19, 36 వార్డులలో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే శానిటరీ డివిజన్ కార్యాలయాలను తనిఖీ చేసి అటెండెన్స్‌ను పరిశీలించారు. సమయానికి విధులకు హాజరు కావాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఆధార్ ప్రత్యేక క్యాంపులు

తాడికొండ: మండలంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.సమతావాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి 21వ తేదీ వరకు ఎస్‌పీపీ ఉన్నత పాఠశాల, 26-28 తేదీల్లో పొన్నెకల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఆధార్ అప్డేట్ చేయించుకోవాలన్నారు.

డీసీ సంఘం అధ్యక్షుడిగా పున్నారెడ్డి

ఫిరంగిపురం: మండల కేంద్రంలో సాగునీటి సంఘాల డీసీ అధ్యక్ష ఎన్నికలు ఇరిగేషన్ అధికారులు నిర్వహించారు. డీసీ 16 నంబరుకు సంబంధించి రేపూడి గ్రామానికి చెందిన ఆరె పున్నారెడ్డిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా యడ్లపాడు మండలం సొలస గ్రామానికి చెందిన మద్దూరి శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. ఇరిగేషన్ ఏఈ కవిత నుంచి పత్రాలను పున్నారెడ్డి అందుకున్నారు. విశ్వనాథరెడ్డి, చిట్టా చిన్న వీరారెడ్డి, పెద్ద వీరారెడ్డి, చిట్టా శంకరరెడ్డి, తిప్పారెడ్డి శంకరరెడ్డి, ఆరె ఉదయ్ దీపక్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి



కానిస్టేబుల్ కల్యాణి(ఫైల్)

మంగళగిరి: పట్టణంలో నివాసముంటున్న మహిళా కానిస్టేబుల్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రేపల్లెకు చెందిన కల్యాణికి(34) నాలుగేళ్ల క్రితం పట్టణంలోని మార్కండేయ కాలనీకి దివి నాగరాజుతో వివాహమైంది. తాడేపల్లి స్టేషన్‌లో కల్యాణి కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది. భర్త నాగరాజు బంగారం పని చేస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. సోమవారం విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్న కల్యాణి అర్ధ రాత్రి ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందింది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారమిచ్చారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత మృతి

తాడికొండ: అనారోగ్యంతో వివాహిత మృతి చెందగా.. వరకట్న వేధింపుల కారణంగానే తమ కుమార్తె మృతి చెందిందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన ఘటన తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపరిమి గ్రామానికి చెందిన కావూరి వరప్రసాద్‌కు చిన పలకలూరు గ్రామానికి చెందిన శ్రీవాణి(27)కి 6 నెలల క్రితం వివాహం జరిగింది. అయితే ఆమె అనారోగ్యంతో ఉండటంతో మంగళవారం అంబులెన్స్‌లో గుంటూరు ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ మరణించింది. అయితే తమ కుమార్తె మరణానికి వరకట్న వేధింపులే కారణమని మృతురాలి తండ్రి పాముల రంగస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ బాబురావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

మహిళా మీ కోసంపై అవగాహన

తెనాలిరూరల్: జిల్లా ఎస్పీ సూచనల మేరకు ఏర్పాటు చేసిన ‘మహిళల మీ కోసం’ కార్యక్రమంపై పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్ఐ రాజ్యలక్ష్మి పట్టణంలో మహిళలకు ఈ కార్యక్రమం గురించి తెలియజేస్తూ రాత్రి వేళ మహిళలు ఇబ్బంది పడకూడదనే జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. జిల్లాలో రాత్రి వేళల్లో ప్రయాణించే మహిళలు 9746414641 నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలిజేస్తే పోలీసులు వారికి ప్రయాణంలో అండగా ఉంటారని వివరించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే



మంగళగిరి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని ఇందిరా కళా మందిర్‌లో మంగళవారం పెన్షనర్స్ డే నిర్వహించారు. పెన్షనర్స్ అసోషియేషన్ జనరల్ బాడీ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. 75 ఏళ్లు నిండిన సీనియర్ పెన్షనర్స్ 30 మందిని ఘనంగా సన్మానించారు. 96 సంవత్సారాలు నిండిన సీనియర్ పెన్షనర్ గద్దె గంగాధర్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర పంటల ప్రాధాన్యంపై అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ యూనిట్ పరిధిలోని వేములూరిపాడులో మంగళవారం శనగ పంట సాగు చేస్తున్న రైతులకు అంతర పంటల ప్రయోజనాలను ప్రకృతి వ్యవసాయ ఎస్ఎఫ్ఏ ఉమాదేవి అవగాహన కల్పించారు. ఆర్‌డీఎస్(రబీడై సోయింగ్) పద్ధతి గురించి వివరించారు. శనగపంటలో అంతర పంటలుగా కందులు, ఆవాలు, జొన్న, సజ్జ, నువ్వులు, ఆముదం, గోరు చిక్కుడు వేసుకోవాలని చెప్పారు. దీని ద్వారా దిగుబడితో పాటు అధిక ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. వీటి ద్వారా భూమి సారవంతం అవుతుందని చెప్పారు. అనంతరం శనగ పంట, వాటి మధ్య అంతర పంటలు వేసుకునే విధానం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఆర్ఎఫ్ ఈశ్వర్ కుమార్‌రెడ్డి, మోడల్ మేకర్ ఇర్ల.వెంకటేశ్వర్లు, యూనిట్ ఇంచార్జి రామకృష్ణ, ఆరుద్ర నరసింహారావు, అమల, తిరుపతమ్మ, రైతులు, మహిళాసంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ఏ ఉమాదేవి

సమస్యలపై అధికారులకు వినతి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి జోనల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పలు సమస్యలపై సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి కొండ చుట్టూ నివసిస్తున్న పేద ప్రజలకు ఉన్న చోటనే రెగ్యులైజ్ చేసి పట్టాలు ఇవ్వాలని, రైల్వే, పీడబ్ల్యూడీ, పోరంబోకు, కొండ పోరంబోకు స్థలాల్లో నివాసముంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఏడేళ్ల క్రితం పుష్కరాల సందర్భంగా తొలగించిన ఇళ్ల బాధితులు 284 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. కొత్తూరు ప్యారీ కంపెనీ ఆవరణలో ఉంటున్న వారికి నివాస స్థలాలు కేటాయించాలని కోరుతూ డీటీ రిజ్వాన్, ఆర్ఐ కె.వేదాంతరావు, వీఆర్ఓ ఇన్నయ్య తదితరులకు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. సీపీఎం నాయకులు కొట్టే కరుణాకర్‌రావు, కె.మేరి, ఎస్కే బాష, గంజి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కేళి వెంకటేశ్వరరావు, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, దార దాసు, మాజీ కౌన్సిలర్ నిర్మల పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

రెవెన్యూ సదస్సుకు 26 అర్జీలు

ఫిరంగిపురం: బేతపూడి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో అడంగల్, పట్టాదారు పాసు పుస్తకాల కోసం 23 అర్జీలు, భూమి కొలతలకు 3 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో శ్రీనివాసరావు, రిజిస్ట్రేషన్ శాఖ జూనియర్ అసిస్టెంట్ షేక్, ఫరీద్ బాష, సర్వేయర్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ అబ్దుల్ రెహమాన్, వీఆర్వో శివనాగరాజు పాల్గొన్నారు.

తవ్వారు - మరిచారు



తవ్వి వదిలివేసిన కల్వర్టు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని గేటు సెంటర్ వద్ద డ్రెయినేజీ పూడిక తీసేందుకు కల్వర్టును కార్పొరేషన్ అధికారులు తొలగించారు. ఇది జరిగి నెలరోజులైనా దానిని నిర్మించడంలో అలసత్వం వహిస్తున్నారు. రైల్వే గేటుకు వెళ్లే మార్గంలో ఈ రహదారి ఉండడం, రైల్వే ట్రాక్ వద్ద నిత్యం రైళ్లు పరుగులు తీస్తుంటాయి. ఎప్పుడు గేటు తీసినా ఈ రహదారి నుంచే ప్రయాణించాల్సి వస్తుంది. ఎటువంటి ప్రమాదం జరగకముందే అధికారులు వెంటనే స్పందించి రైల్వే గేటు వద్ద కల్వర్ట్ నిర్మించాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

సుస్థిర లక్ష్యాలు సాధించేలా ప్రణాళికలు

తాడికొండ: గ్రామ పంచాయతీలు ప్రభుత్వం సూచించిన సుస్థిర లక్ష్యాలను సాధించేలా ప్రణాళికలతో ముందుకెళ్లాలని ఎంపీడీవో కె.సమతావాణి అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు, స్థానికీకరణపై సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ పాల్గొని పేదరిక, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, బాలికా సంరక్షణ, ప్రజల జవాబుదారీ పాలన వంటి అంశాలను లక్ష్యాలుగా చేసుకొని గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. పలు అంశాలపై శిక్షణ అందజేసి గ్రామాల్లో సంపూర్ణ ఎదుగుదలకు బాటలు వేయాలని సూచించారు. ఈవోపీఆర్డీ శివలీల, ఏపీఎం సాంబశివరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం పెరుగుతుంది

ఐసీఆర్‌పీ అద్దంకి వెంకట రమణ

వల్లభాపురం (కొల్లిపర): రైతులు అందరూ ప్రకృతి వ్యవసాయం చేయటం వలన రసాయన ఎరువులు వల్ల భూసారం కోల్పోయిన భూమి మళ్లీ భూసారం పెరుగుతుందని ఐసీఆర్‌పీ అద్దంకి వెంకట రమణ అన్నారు. మండలంలోని వల్లభాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మంగళవారం రైతులకు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు, మొక్కలు ఎదుగుదలకు చాపబెల్లం ద్రావణం ఏవిధంగా తయారు చేసుకోవాలని గురించి అవగాహన కల్పించారు. నేడు రసాయన ఎరువులు వాడటం వల్ల గతంలో ఎన్నడూ లేని విధంగా రోజుకు ఒక రకమైన కొత్త రోగాల బారిన ప్రజలు పడతున్నారు. వీటి నుంచి తప్పించుకోవాలంటే ప్రతి రైతు పూర్వీకులు అనుసరించిన సేంద్రియ ఎరువుల ద్వారా వ్యవసాయం చేయడం వల్ల సాధ్యమవుతుందన్నారు. అనంతరం మొక్కల ఎదుగుదలకు అవసరమైన చాప బెల్లం ద్రావణం రైతులు ఇంటి వద్దనే ఏ విధంగా తయారు చేసుకోవాలని ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ఐసీఆర్‌పీలు, ఇంటర్నల్ కమ్యూనికేషన్ పద్మావతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సాగు అంశాలను వివరిస్తున్న వెంకటరమణ

ప్రణాళికతో గ్రామాల అభివృద్ధి

ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఎంపీడీవో వి.విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి ప్రణాళికపై 3వ బ్యాచ్ కి మొదటి రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ 2030వ సంవత్సరం నాటికి ప్రభుత్వం నిర్దేశించిన 9 లక్ష్యాలు, 2047వ సంవత్సరం నాటికి 17 లక్ష్యాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాల గురించి సచివాలయం సిబ్బందికి వివరించారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, మాస్టర్ ట్రైనీలు ఈవోపీఆర్డీ సి.హెచ్.భార్గవ, ఎంపీహెచ్ఓ వీ.లక్ష్మి, ఐసీడీఎస్ అధికారి కె.వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ సుధాకర్, ఎంపీఎం పి.రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ మూర్తి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.